నమస్తే తెలంగాణ







యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ

# కేసీఆర్‌కు పోటెత్తిన అభిమానం

- పరామర్శకు భారీగా తరలివచ్చిన జనం
- బయటకు వచ్చి సర్దిచెప్పిన కేటీఆర్
- బీఆర్ఎస్ అధినేతకు ప్రముఖుల పరామర్శ
- కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనను ప్రత్యక్షంగా చూసి వెళ్లాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు సోమాజిగూడ యశోద దవాఖానకు పోటెత్తారు. అభిమాన నేత కేసీఆర్‌ను చూసేందుకు అవకాశం కల్పించాలని వేడుకొన్నారు. మహిళలు, వృద్ధులు, యువకులు పార్టీలకు అతీతంగా తరలిరావడంతో మంగళవారం రాజ్‌భవన్‌రోడ్ జనంతో పోటెత్తింది. గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. కేసీఆర్‌ను పరామర్శించేందుకు వస్తున్న ప్రముఖులు, సందర్శకులను సమన్వయం చేసుకొనేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు మూడుసార్లు బయటకు వచ్చి 'సార్..లోపల కోలుకుంటున్నారు.. త్వరలోనే ప్రజల మధ్యకు వస్తారు.. దయచేసి మీరంతా తిరిగి క్షేమంగా ఇండ్లకు వెళ్లండి' అని సర్ది చెప్పారు. ఒకదశలో మహిళలు పెద్ద సంఖ్యలో దవాఖాన ఎదుట 'జై తెలంగాణ'.. 'జై కేసీఆర్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. జనంతాకిడి పెరుగుతున్న విషయాన్ని దవాఖాన వర్గాలు కేసీఆర్‌కు నివేదించారు. దీంతో కేసీఆర్ 'మీ అభిమానానికి చేతులెత్తి దండంపెడుతున్న.. మీరందరూ సురక్షితంగా ఇండ్లకు తిరిగి వెళ్లండి. కోలుకున్న తర్వాత మీ మధ్యకు వస్తా' అని వీడియో సందేశం పంపారు.

### దేశవ్యాప్తంగా కేసీఆర్ యోగక్షేమాలపై ఆరా

కేసీఆర్ ఆరోగ్యస్థితిగతులపై దేశనలుమూలల నుంచి పలువురు ప్రముఖులు ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మేఘాలయ ముఖ్యమంత్రి కే సంగ్మా, యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ యోగక్షేమాలపై ఆరా తీశారు. గవర్నర్ తమిళిసై బుధవారం కేసీఆర్‌ను పరామర్శించనున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తెచ్చిన ముంజేతి కంకణాన్ని ఆయనకు కట్టారు. కేసీఆర్ నుదట కుంకుమ తిలకాన్ని దిద్ది ఆశీర్వచనాలు అందజేశారు. ప్రముఖ క్రైస్తవ బోధకుడు కేఏ పాల్ కేసీఆర్‌ను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

### కేసీఆర్‌కు మంత్రులు, ప్రొటెం స్పీకర్ పరామర్శ

కేసీఆర్‌ను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, స్పీకర్ ప్రొటెం అక్బరుద్దీన్ ఒవైసీ పరామర్శించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పట్నం మహేందర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్, ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, సునీతా లక్ష్మారెడ్డి, లాస్య నందిత, అరికెపూడి గాంధీ, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్ గౌడ్, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, మదన్‌రెడ్డి, డీఎస్ రెడ్యానాయక్, డాక్టర్ టీ రాజయ్య, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, గాదరి కిశోర్, జీవన్‌రెడ్డి, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, రావుల శ్రీధర్‌రెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, పీఎల్ శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్ తదితరులు కేసీఆర్‌ను పరామర్శించారు. టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ సహా పలువురు జర్నలిస్టులు కూడా కేసీఆర్‌ను పరామర్శించారు.

# త్వరలో మీ ముందుకొస్తా

మొదటిపేజీ తరువాయి...

చేయించాయి. వీడియో సారాంశం కేసీఆర్ మాటల్లోనే.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా.. వేలాదిగా తరలివచ్చిన అభిమానులందరికీ నా హృదయపూర్వక వందనాలు. నాకు అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్‌తో యశోద హాస్పిటల్‌లో ఉన్న. ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటది. దాంతో సమస్య ఇంకా పెరిగి చాలా అవస్థలు వస్తయి. నెలల తరబడి హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తదని వైద్యబృందం నన్ను హెచ్చరించింది. అందువల్ల మీ అభిమానానికి చేతులెత్తి దండంపెడుతున్న. మీరందరూ బాధపడకుండా మీమీ స్వస్థలాలకు క్షేమంగా వెనుతిరిగి పోవాలె. రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.. కనీసం ఇంకో 10 రోజుల వరకు ఎవరూ కూడా తరలిరావద్దని.. అందరికిగూడ మంచిది కాదని వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నా. ట్రాఫిక్ వాళ్లకు కూడా ఇబ్బందులున్నాయి. హాస్పిటల్‌లో మనంకాకుండా వేరే వందలాది మంది పేషెంట్లు కూడా ఉన్నరు. వాళ్ల క్షేమం కూడా మనకు అంతే ముఖ్యం. మీరు అన్యదా భావించకుండా క్రమశిక్షణతో క్షేమంగా మీమీ ఇండ్లకు చేరండి. నేను కోలుకున్న తర్వాత రోజూ ప్రజల మధ్యనే ఉండేవాడినే కాబట్టి మనం కలుసుకుందాం. ఇబ్బంది లేదు. నా కోరిక మన్నించి హాస్పిటల్ దగ్గర.. హాస్పిటల్ లోపల పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మీరు వెంటనే తరలివెళ్లాలి. మీరు క్షేమంగా ఇండ్లకు చేరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. నా మాటను మన్నించి, గౌరవించి ఏమాత్రం ఇబ్బంది లేకుండా గొడవ లేకుండా మీరందరూ స్వస్థలాలకు వెళ్లాలని.. నా విజ్ఞప్తిని మీరు తప్పకుండా మన్నించి గౌరవిస్తారని భావిస్తున్నా.. ధన్యవాదాలు.

# స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించండి

- మీ అనుభవాన్ని మాకూ అందించండి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కుదుటపడుతున్న కేసీఆర్ ఆరోగ్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను కోరామని ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కేసీఆర్‌కు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని తమకు అందించి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సహకరించాలని కోరామని చెప్పారు. మంగళవారం ఆయన యశోద దవాఖానలో కోలుకుంటున్న కేసీఆర్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పరామర్శించారు. అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యవంతులై అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఈ సందర్భంగా కేసీఆర్‌కు హామీ ఇచ్చామని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడుతున్నదని, బహుశా రెండు మూడు రోజుల్లో దవాఖాన నుంచి డిశ్చార్జ్ అవుతారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

### స్పీకర్ ఎన్నిక నామినేషన్‌కు హాజరుకానున్న కేటీఆర్

రాష్ట్ర శాసనసభ నూతన స్పీకర్ ఎన్నిక కోసం బుధవారం వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సహా పలువురు నేతలు హాజరుకానున్నారు. స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరిన నేపథ్యంలో నామినేషన్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.



జహీరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కృతజ్ఞతా సభలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# ప్రజల గొంతుకవుదాం

మొదటిపేజీ తరువాయి...

భరోసా ఇచ్చారు. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లతో బీఆర్ఎస్ అధికారానికి దూరం కావాల్సి వచ్చిందని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని జనం నమ్మారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇచ్చినందున వారి పక్షాన నిలబడదామని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకై వారి పక్షాన పనిచేద్దామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరేలా చూద్దామని, నెరవేర్చకుంటే పోరాడదామని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు గెలిచారని, తాము కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజలు, పార్టీ శ్రేణుల వెన్నంటే ఉంటామని హామీ ఇచ్చారు.

### కలిసికట్టుగా పనిచేసి గెలిపించారు

ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి ఏడుచోట్ల పార్టీ అభ్యర్థులను గెలిపించారని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పది సీట్లు గెలుస్తామని అనుకున్నా మెదక్, నారాయణఖేడ్‌లో స్వల్ప మెజార్టీతో ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటామని, ఎక్కడైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుంటామని తెలిపారు. సంగారెడ్డి, జహీరాబాద్‌లో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు గెలుపుకోసం పార్టీశ్రేణులు ఐక్యంగా పనిచేశాయని అభినందించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో చింతా ప్రభాకర్ ఆరోగ్యం బాగాలేకున్నా ప్రతి నాయకుడు, కార్యకర్త తామే అభ్యర్థిగా భావించి ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేసినట్టు చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేసీఆర్ తెలంగాణ సాధించారని, అదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశారని, కరెంటు, సాగునీరు, తాగునీటి సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. తలసరి ఆదాయంలో రాష్ట్రం దేశంలో అగ్రభాగాన నిలిచిందని, అడవుల విస్తీర్ణం 7.7 శాతానికి పెరిగిందని తెలిపారు. త్యాగాల పునాదుల మీద నిర్మించిన తెలంగాణపై కేసీఆర్‌కు, మనకు ఉన్న ప్రేమ మరెవరికీ ఉండదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలో తొందరపడొద్దని, అది ఏం చేస్తుందో వేచి చూద్దామని సూచించారు. సభలో జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, నరోత్తం, తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు మాణిక్యం, జైపాల్‌రెడ్డి, హకీం, ముఖీమ్, నరహరిరెడ్డి, కాసాలబుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారే ప్రసక్తే లేదు

- బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం
- నిత్యం ప్రజల పక్షాన పోరాడుతాం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం



హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న ప్రచారంలో నిజం లేదని, పార్టీ మారాల్సిన అవసరం తనకు ఎంతమాత్రం లేదని చెప్పారు. గెలిచినప్పుడు పొంగిపోవడం.. ఓడినప్పుడు కుంగిపోవడం రాజకీయ నాయకుల లక్షణం కాదని పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ఎల్పీ కార్యాలయంలో సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమని, ఇందులో రాజకీయ పార్టీలు గెలిచినా.. ఓడినా అవి నిరంతరం ప్రజల పక్షానే నిలబడతాయని తెలిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నిత్యం ప్రజల పక్షాన నిలుస్తుందని చెప్పారు. తాము బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని స్పష్టం చేశారు. గెలిచిన ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ నిర్మాణాత్మక సూచనలు తప్పకుండా చేస్తుందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌పార్టీ నిలబెట్టుకోవాలని కోరారు. కొత్త ప్రభుత్వానికి కనీసం నాలుగైదు నెలల సమయం ఇచ్చి వేచి చూశాక.. హామీలు అమలు చేయకపోతే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు శత్రువులు కాదని తెలిపారు.

# ప్రాణమున్నంత వరకు కేసీఆర్‌తోనే ఉంట

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



కమలాపూర్, డిసెంబర్ 12: తన గొంతులో ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశా రు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు వచ్చిన ఆయన్ను స్థానిక పద్మశాలీ కమ్యూనిటీ హాలులో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కౌశిక్‌రెడ్డిని సన్మానం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నట్టు కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే నాయిని అనుచరులను శిక్షించాలి

- ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం చట్ట విరుద్ధం
- సీపీకి మాజీ చీఫ్ విప్ దాస్యం ఫిర్యాదు

సుబేదారి, డిసెంబర్ 12: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను కోరారు. ఈ మేరకు మంగళవారం వినయ్‌భాస్కర్.. మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్, కార్పొరేటర్లతో కలిసి హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లి సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం.. రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులు ఏర్పాటు చేసిందని, ఇందులో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని 2018లో ప్రారంభించిందని తెలిపారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పూజలు చేసిన అనంతరం.. ఆయన అనుచరులు దౌర్జన్యంగా క్యాంపు కార్యాలయ ప్రారంభ శిలాఫలకాన్ని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, ఇది చట్టవిరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ ఎమ్మెల్యేగా 15 ఏండ్లు పనిచేసిన తాను, తన అనుచరులు ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని చెప్పారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు.



అయోధ్యరెడ్డి, విజయ్‌కుమార్

# సీఎం సీపీఆర్వోగా అయోధ్యరెడ్డి

- ఢిల్లీ పీఆర్వోగా విజయ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంబంధాల ముఖ్య అధికారిగా సీనియర్ జర్నలిస్టు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఢిల్లీలో సీఎం పీఆర్వోగా దూదిపాళ్ల విజయ్ కుమార్ నియమితులయ్యారు. వీరి నియామక ఉత్తర్వులను సీఎస్ శాంతికుమారి మంగళవారం విడుదల చేశారు. నల్లగొండ జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లికి చెందిన అయోధ్యరెడ్డి ప్రజాశక్తి, ఆంధ్రజ్యోతి, సాక్షిలో వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలం పాత్రికేయునిగా కొనసాగారు. ఖమ్మం జిల్లాకు చెందిన విజయ్ బీఏ, బీఈడీ పూర్తిచేశారు. 17 ఏండ్లుగా ఈనాడు ఢిల్లీ ప్రతినిధిగా పనిచేస్తున్నారు.



సూర్యాపేటలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

# కరెంట్ ఇవ్వలేక సాకులా?

- ఉమ్మడి రాష్ట్రంలో 6 వేల మెగావాట్లు..
- స్వరాష్ట్రంలో 18 వేల మెగావాట్ల ఉత్పత్తి
- అసెంబ్లీలో కరెంట్‌పై నేనే చర్చ పెట్టి వివరిస్తా: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. కరెంట్ ఇవ్వడం చేతకాక విద్యుత్తు శాఖలో అప్పులు పేరుకుపోయాయంటూ సాకులు చెప్పి తప్పించుకుంటున్నదని మాజీ విద్యుత్తు శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేందుకు కొంత అప్పు చేయాల్సి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు తేకుండా కరెంట్ ఎలా ఇస్తుందో చూస్తామని అన్నారు. అప్పుల విషయమై అసెంబ్లీలో తనను అడిగితే సమాధానం చెప్పేవాడినని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి 6 వేల మెగావాట్లు అయితే ప్రస్తుతం తెలంగాణలో 18 వేల మెగావాట్లకు చేరుకున్నదని అన్నారు. నాడు జెన్‌కో ఆస్తులు రూ.18 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.50 వేల కోట్లకు చేరుకున్నట్టు చెప్పారు. అప్పట్లో 6 గంటలు కరెంట్ ఇస్తే కేసీఆర్ సర్కారు 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించిందని గుర్తుచేశారు. హామీల అమలుకు దమ్మూ, ధైర్యం ఉండాలని.. సాకులు చెబితే నడువదని అన్నారు. అసెంబ్లీలో కరెంట్‌పై చర్చను తానే పెట్టి ఉన్నది ఉన్నట్టు చెప్తానని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు.

# జెన్‌కో రాత పరీక్ష వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జెన్‌కో రాత పరీక్ష వాయిదా పడింది. ఈ నెల 17న జరగాల్సిన ఈ పరీక్షను అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేస్తున్నట్టు జెన్‌కో ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్), కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఈ ఏడాది అక్టోబర్‌లో జెన్‌కో నోటిఫికేషన్ జారీ చేసింది. 17న ఇతర పోటీ పరీక్షలు కూడా ఉండటంతో జెన్‌కో పరీక్షను వాయిదావేయాలని అభ్యర్థులు కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కలను కలిసి విజ్ఞప్తిచేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షను వాయిదావేస్తున్నట్టు జెన్‌కో ప్రకటించింది. తదుపరి షెడ్యూల్‌ను సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని జెన్‌కో వర్గాలు వెల్లడించాయి.

## లోకం పోకడ




తుచ్ఛము, హేయమైన అరెస్టులు ఆపండి నాయనా.. గంజాయి సేవించండి.. దివ్యమైన అనుభూతితో ఆనంద డోలికల్లో తేలియాడండి!

## వారంపాటు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా రాబోయే వారంపాటు వాతావరణం చల్లగా ఉండటంతో పాటు వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణశాఖ అంచనా వేసింది. ఆకాశం ప్రశాంతంగా ఉంటుందని, మేఘాలు కూడా ఉండవని పేర్కొన్నది. కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల వరకు పడిపోనున్నట్టు తెలిపింది. ఈ వారంపాటు ఎలాంటి తుఫానులు సంభవించే పరిస్థితులు లేవని ప్రకటించింది. ప్రస్తుతం మాల్దీవులు వద్ద ఉపరితల ఆవర్తనం ఉన్నదని, దీని వల్ల తెలుగు రాష్ట్రాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. చిరుజల్లులు కురిసే అవకాశమూ లేదని స్పష్టం చేసింది. ఈ నెల 19 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశమే లేదని వెల్లడించింది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 11.2°c | 32.8°c |
| ఆదిలాబాద్ | 12.6°c | 34.1°c |
| మెదక్ | 13.2°c | 32.4°c |
| ఖమ్మం | 16.0°c | 28.0°c |
| వరంగల్ | 16.0°c | 29.0°c |
| నిజామాబాద్ | 16.5°c | 30.3 °c |
| హైదరాబాద్ | 16.6°c | 29.3°c |
| కరీంనగర్ | 17.0°c | 28.0°c |
| నల్లగొండ | 17.4°c | 33.6°c |
| మహబూబ్‌నగర్ | 18.6°c | 30.6°c |

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### టెక్నికల్ ఆఫీసర్లు..

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్(ఐపీఆర్)లో కింది ఖాళీల భర్తీ కోసం ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: టెక్నికల్ ఆఫీసర్-సీ,
- విభాగాలు: కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: డిసెంబర్ 18
- వెబ్‌సైట్: https://www.ipr.res.in/

### ఎన్ఐవోఎస్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 62
- పోస్టులు: డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, సెక్షన్ ఆఫీసర్, పీఆర్వో, జేఈ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: డిసెంబర్ 21
- వెబ్‌సైట్: https://www.niosondemand.org/

### సెయిల్‌లో..

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 92
- పోస్టులు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ
- విభాగాలు: సివిల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: డిసెంబర్ 31
- వెబ్‌సైట్:https://www.sail.co.in/en/home

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పెడగాజీ, కెమిస్ట్రీ, జాగ్రఫీ (డీఎస్సీ, గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.